

# ఆండాళ్ నెం.2

రంగనాధాచార్యులవారు పరమ వైష్ణవులు. వారి భార్య అలమేలు మంగ పుట్టింటివారంతా ఉద్యోగస్థులు కావటంమూలాన ఆమె కొంత ఆధునికమైనా భర్తను ఆచార వ్యవహారాల్లో అనుసరించక తప్పలేదు. నిత్య స్నానాలు, స్వామి పూజకు పూలహారాలు, మడితో నైవేద్యాలు జరుగుతూవుండవలసిందే. ఆమెకు ఒంట్లో బాగుండకపోయినా నూట నాలుగు జ్వరమున్నా, వక్రమంగా ఏ పని జరగకపోయినా అంత వైష్ణవుడూ పరమశివుడై మూడోకన్ను తెరుస్తాడు. తిరుప్పావై పఠించే ధనుర్మాస ఆరంభంలో ఆ యింటికి మహా నటులు రామానుజాచార్యులు వచ్చారు. రామానుజాచార్యులు ఎంతో అందమైన విగ్రహం. ఆయన విప్రనారాయణుడు వేస్తే ఎంతో మనోహరంగా వుంటుంది. గిరజాలు జుట్టు లేదు. కాని ప్రస్తుతం మున్నటి గుండు, పంగ నామాలతో చొక్కా అయినా లేకుండా విప్రనారాయణ వేషంలో దిగారు. రంగనాధాచార్యులవారి విషయం తెలిసిన వారగుటచేత సరాసరి పెరట్లోకి వెళ్లి బావి దగ్గర కాళ్లు కడుక్కొని లోపలికి ప్రవేశించారు. ఆండాళ్ వైష్ణవ చీరె కట్టుతో, ముక్కు బులాకీలతో, కాళ్లకు అందెలతో సాక్షాత్తు ఆండాళ్ లాగా వుంది. రంగనాధాచార్యులుగారికి ఆమెను చూడగానే మతిపోయింది. ఆ పిల్ల యెడల ఏదో తెలియని భక్తిభావం కలిగింది. తన ఒక్కగానొక్క కొడుక్కి ఆమెనిచ్చి పెళ్లి చేసి కోడలుగా చేసుకుంటే తన జీవితం ధన్యమవుతుందనిపించింది. పిల్ల ప్రోద్బలం మీద ఆ నెల శ్రీవిల్లి పుత్తూరులో గడపాలని వచ్చామని రామానుజాచార్యులు అన్నాడు. ఎక్కడికీ పోవడానికి వీల్లేదని రంగనాధాచార్యులు పట్టు పట్టారు. ఆ పిల్ల ప్రతిరోజూ ఆండాళ్ లాగా అలంకరించుకుని విష్ణుపూజ చేస్తూనే వుంది. ఇంతలో రంగనాధాచార్యులు గారి కొడుకు శ్రీనివాస్ మద్రాసులో పిహెచ్.డి. పేపర్సు రాసి వచ్చాడు. తండ్రి కొడుకును దూరంగా వేరే గదిలో వుండమన్నాడు. తమ యింటికి ఆండాళ్ వచ్చిందన్నాడు. ఆండాళ్ మాత్రం రంగనాధాచార్యులు గారి భార్యతో అన్ని పనులు చేస్తోంది. రంగనాధాచార్యులు కొడుకు శ్రీనివాస్‌కు రామానుజాచార్యులును, కూతురు ఆండాళ్‌ను పరిచయం చేశాడు. ఆమె తిరుప్పావై పాడితే అద్భుతంగా, మనోహరంగా వుంది. కాని ఆమె మితిమీరిన ఆచార వ్యవహారాలతో అరికాలి మంట నెత్తి కెక్కుతోంది శ్రీనివాస్‌కు. ఒకనాడు బజారు నుంచి కూరలు తెచ్చి నడవలో వుంచి, చిల్లర పక్కన పెట్టాడు శ్రీనివాస్. ఆండాళ్ ఒక బిందెడు నీళ్లు తెచ్చి పోసింది. ఆ రోజు పెద్ద రగడ జరగాల్సింది. ఆమె కళ్ళల్లోకి శ్రీనివాస్ చూడ్డంతో ఆగిపోయింది. "వాళ్లు అతిథులు, దేవతలు. వాళ్లకూ నీకూ పడకపోతే నువ్వే మద్రాసు పొమ్మ"న్నాడు రంగనాధాచార్యులు కొడుకుతో. మర్నాడు ఉదయం శ్రీనివాస్ నున్నగా గుండు గీయించుకుని పంగ నామాలు ధరించి తండ్రి మెప్పు పొందాడు. వెంటనే రామానుజా చార్యులును ఒక గదిలో కూర్చోబెట్టి ఆండాళ్‌ను తన కోడల్ని చేసి తన యిల్లు పావనం చెయ్యమన్నాడు రంగనాధాచార్యులు. ఆండాళ్ వెనుక చాలా కథ వుంది కుదరదన్నాడు రామానుజాచార్యులు. ఏ కథ వున్నా నాకు పర్వాలేదన్నాడు రంగనాధాచార్యులు. ముహూర్తం పెట్టించారు. శ్రీనివాస్‌కు ఆండాళ్‌కు వివాహమైంది. అంతా ఎవరి వూళ్లకు వాళ్లు వెళ్లారు. కోడల్ని కాపురానికి తీసుకురావడానికి పూజా మందిరానికి రంగులు వేయించి అలంకరణ చేస్తున్నారు. జ్యోతిష్కుడిని ముహూర్తం పెట్టమంటున్నారు. వాకిట్లో రిక్షా ఆగింది. శ్రీనివాస్ ఆండాళ్లు దిగారు. ఆండాళ్ అల్ట్రా మోడ్రన్ డ్రస్సులో దిగింది. పాంట్, షర్ట్ టక్ చేసి వచ్చింది. "కోడలేదిరా?" అన్నాడు రంగనాధాచార్యులు. 'ఇదిగో' అని ఆండాళ్‌ను చూపాడు. 'మాణింగ్ మామా' అంది ఆండాళ్. తాను రామానుజాచార్యులుగారు పెంచిన అనాథనని, వీను ప్రేమించిన సనాథనని, అమ్మా, నాన్న లేరు గనుక తనకు కులం లేదని, దేవుడిలాంటి వీనును పూజించి, ప్రేమించి పెళ్లాడానని, తానే నిజమైన ఆండాళ్‌నని చెప్తుంటే రంగనాధాచార్యుల కళ్ల వెంట నీరుగారింది. అవే ఆమెకు అక్షింతలు.

— చెరువు ఆంజనేయశాస్త్రి

---

గీత్‌మాల క్యాసెట్ గెలుచుకున్న

## కాలమ్ దాటని కథ

అక్కడ సమావేశమైన సాహితీవేత్తలందరూ తదేకంగా చూస్తున్నారు మహాకవి వైపు......

ఆయన సిగరెట్ పీలుస్తూ, గుప్పు గుప్పున పొగ వదులుతున్నాడు తాపీగా......

కృష్ణశాస్త్రివైపు తిరిగి చిరునవ్వుతో...... "ఇంద్ర లోకంలో ఊర్వశి స్టన్నింగ్ బ్యూటీలో ఉంటుందో లేదో కానీ మీ ఊర్వశి మాత్రం మా హృదయంలో చిరంజీవి" అన్నారు. చప్పట్లు మారుమోగాయి...... నండూరిని ఉద్దేశించి—

"నండూరి ఊహల పల్లకిలో ఊరేగే ఎంకి వెన్నెల కవితా వెలుగును చిందే చంద్ర వంక" నండూరి వారి గుండె గొంతుకలో కొట్లాడింది కాసేపు...... తర్వాత చలాన్ని భుజం తట్టి, లాలనగా అన్నాడు...

"అణాలు వాడుకలోంచి పోయినా అరణాల తెలుగు ఆడబడుచు అరుణని సృష్టించటం అనితర సాధ్యం." చలం మౌనాన్ని కౌగలించుకున్నాడు.

## మహాకవి ప్రశ్న

మహాకవి, రంగనాయకమ్మ వైపు తిరిగి "జానకికి విముక్తిలభించినా నిజ జీవితంలో పురుషునిదే పై చేయిగా ఉండే అని నా బాధ..." అన్నారు.

పురాణం వారి అదుర్దాని గమనించి "శివకాంత రాజారామణయ్యగారి వెంట చేరటం శివునికి ఇష్టం కావటం వల్ల అది సాహితీవేత్తల అభిమానాన్ని చూర గొన్నది."

ఇది యిలా వుండగా... అందరూ కలిసి శ్రీశ్రీని యిలా ప్రశ్నించారు: "మీకు మధుర వాణి అంటేనే ఎక్కువ ప్రేమ ఎందుకని?"

మహాకవి యిలా "మధురవాణి అంటే ఇష్టపడని వారుంటారా? ఎందుకంటె మధుర వాణికంటె మగ వాడి గురించి బాగా తెలిసిన వారెవరైనా ఉంటారా?" అన్నారు.

అందరూ హాయిగా నవ్వారు... చివరిగా శ్రీశ్రీ ఓ ప్రశ్న వేశారు......" మీరంతా స్త్రీకి ఉన్నత స్థానాన్ని కల్పించి స్త్రీ ఉద్ధరణ కోసం కృషి చేస్తున్నా ఈ సమాజంలో స్త్రీకి గౌరవం ఎందుకని లేదు?"

—పోరంకి హేమ ప్రభాకర్